143

# చంఘిజ్‌ఖాన్

రచనా కాలం : 1956

తెన్నేటి సూరి
(1911–1958)

తెలుగు నవలా సాహిత్యంలో "చంఘిజ్‌ఖాన్" నవలకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. కథాకథనంలో విస్పష్టమైన రూపురేఖలున్న స్త్రీ పురుషులను ఒక విస్తృత నేపథ్యంలో చిత్రించి ఏ పాత్ర కాపాత్ర విశిష్టంగా, ప్రత్యేక వ్యక్తిత్వం కలదిగా సృష్టించడం సూరి నవలా నిర్మాణ ప్రజ్ఞకు నిదర్శనం. అంతేకాదు, ఏ తెలుగు చారిత్రక నవలాకారుడు చేయని పనిని సూరి విజయవంతంగా నెరవేర్చాడు. అది: భారతదేశతీరాలకు ఆవల ఉన్న మంగోలుల జీవన విధానాన్ని, వారి సంఘర్షణలను, సంతోషాలను తెలుగు నవలలో గుదిగుచ్చడం. ప్రపంచంలో ఏ నవలాకారుడయినా తన ప్రంత, లేద దేశ చరిత్రను నేపథ్యంగా చేసుకుంటాడు. దానికి ఒకటే కారణం– తన పాత్రల జీవితాలకు అనువైన, సహజమైన వాతావరణాన్ని సృష్టించడం. సూచి చిత్రించిన పాత్రలు, తమ సహజమైన గోబీ ఎడారి వాతావరణంతో సహా తెలుగు వాకిట ప్రత్యక్షమయిందా అన్నంత సహజంగా ఉంటాయి. సుదీర్ఘమైన చారిత్రక పరిశోధన, అనుషంగిక (చైనా వంటి దేశాల చరిత్ర, పాశ్చాత్యులు హ్రస్వ దృష్టితో రచించిన మంగోలుజాతి చరిత్ర, ముఖ్యంగా చంఘీజ్‌ఖాన్ చరిత్ర) చారిత్రక సాహిత్యం, 12వ శతాబ్దం నాటి ఎడారి తండాల జీవలక్షణాల అధ్యయనం– ఇవి సూరి నవలకు ఒక ప్రత్యేకమైన authenticity ని తీసుకొని వచ్చాయి. మంగోల్ ప్రజల జీవిత చరిత్రను గ్రంథస్థం చేయడానికి తన జీవితాన్నే అంకితం చేసిన హెన్రీ హోవర్త్ రచనలు ఆధారంగా ఈ నవలను రాశానని చెప్పుకున్న సూరి దీనిని హోవర్త్ దంపతులకు అంకితం ఇచ్చాడు. ఈ నవల ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో ధారావాహికంగా ప్రచురింపబడినప్పుడే అశేష పాఠకుల అభిమానాన్ని చూరగొన్నది.

కేవలం 123 డేరా–ఇళ్లు మాత్రమే ఉన్న ఒక బంజార తండా నాయకుడు ప్రపంచంలో ముప్పాతిక వంతు భాగాన్ని జయించి మూడు శతాబ్దాల వరకు స్వర్ణయుగాన్ని అనుభవించిన ఒక మహా సామ్రాజ్యాన్ని ఎలా స్థాపించగలిగాడు? ఇదంతా కేవలం సైనికశక్తి చేత సాధించగలిగాడన్నా అంత చిన్న ప్రాంతీయ నాయకుడికి ఇంతటి శక్తి ఎలా కలిగింది? అలాంటి మహాశక్తులను కరగతం చేసుకోవడానికి మానవుడుగా అతనిలో ఉన్న బలీయమైన గుణ సంపత్తి ఏమిటి? ఈ దిశగా ఆలోచించి, పరిశీలించి, పరిశోధించి, మధనపడి సూరి చంఘీజ్‌ఖాన్‌లో క్రూరత్వం అన్ని మంగోలు తండాలను కలపాలన్న అతని దృఢ నిశ్చయం అనీ, అంతకుమించి అతనిలో నాయకత్వ లక్షణం, రాజకీయ పరిపక్వత, శత్రువులను క్షణంలో బేరీజు వేసే రాజకీయ నైశిత్యం– అన్నిటినీ మించి ఇతర జాతులవారు తమ జాతి మీద చేస్తున్న అత్యాచారాలను ఆపడానికి తమ తండాలను సమైక్యం చేయడం ఒక్కటే మార్గం అన్న సామాజిక అవసరం– ఇవి అన్నీ కారణాలుగా విశ్లేషిస్తాడు సూరి. "చంఘీజ్‌ఖాన్ నా ఆదర్శవీరుడు" అన్న నెహ్రూ మాటల్లోనే తన నవలానాయకుడిలో ఉన్న ప్రేమపాత్రుడైన మానవుడిని, మంగోలుజాతిని సమైక్యంగా ముందుకు నడపగల మహానాయకుడని ధ్వనించాయి సూరికి.

చంఘిజ్‌ఖాన్ అంటే ప్రపంచవిజేత. అసలు అతని పేరు చెమూజిగ్– అంటే ఉక్కు మనిషి. అతని తండ్రి యూసుకైఖాన్ మంగోలు తండాలలో ఒకటైన యెక్కామంగోలు తండాకు నాయకుడు. గొప్ప



1

ధైర్యసాహసాలున్న వ్యక్తి. మెర్కిట్ తండాకు చెందిన యూలన్‌ను ఆమె పెళ్లిరోజునే బలవంతంగా ఎత్తుకు వచ్చి పెళ్లి చేసుకున్నాడు. మంగోలు జాతంతా ఒకటి కావాలని ఆశించి అందుకు వ్యూహం రచించినవాడు అతను. తన విరోధి తండాల చేత హతుడైతే టెమూజిన్‌ను ఖాఖాన్ (మహారాజు) గా ఎన్నుకున్నారు తండాల నాయకులు.

టెమూజిన్ శత్రువుల యెడ ఎంత క్రూరుడో తనవాళ్ల మీద అంతటి అభిమానం ఉన్నవాడు. తండ్రి చనిపోయాక తండాల పెద్దలందర్నీ పిలిచి, తాను సింహాసనం దిగి, ఇప్పుడు పెద్దలంతా తమకు ఎవరు యీ తండాలకు నాయకత్వం వహించగలరో ఆలోచించి ఆ నాయకుడినే ఎన్నుకోమంటాడు. తండాల వాళ్లంతా అతనినే ఎంపిక చేస్తారు. ముందు తటపటాయించిన అతని సవతి తమ్ముడు కూడా చివరకు అతనినే ఖాఖాన్‌గా ఒప్పుకుంటాడు. టెమూజిన్ ఎంత విద్యాగంధం లేని మూర్ఖుడో చెమూగా అంత చదువుకున్నవాడు. మేనమామ కంచర్ దగ్గర చైనా భాష నేర్చుకొని ఆ భాషలో అనేక ధర్మశాస్త్ర గ్రంథాలు చదివాడు. చైనాలో జరుగుతున్న అభివృద్ధిని గురించి విని తమ తండాలు కూడా ఎప్పటికైనా ఒకచోట స్థిర నివాసం ఉండి పొలాలు దున్నుకుంటూ ప్రశాంత జీవనం గడపాలని ఆశించాడు. కాని కొత్తగా ఖాఖాన్ అయిన తన అన్న తమ తండాలను బలవంతులనుగా చేయాలని, ప్రతి తండాలోను యువకులంతా సైన్యంలో చేరి తరిఫీదు పొందాలని ఆజ్ఞాపించాడు. ఆమాటే ఖాఖాన్‌తో అంటే ముందు మనల్ని మనం రక్షించుకోవడం అవసరం. మనం పొలాలు దున్నుకుంటూ కూర్చుంటే శత్రువులు మన మీద పడి మన ఆస్తులను, మన ఆడవాళ్లను ఎత్తుకు పోతుంటే చూచి ఊరుకోవలసిందే! అందువల్ల ముందు ప్రతి తండా ఆత్మరక్షణకు పూనుకోవాలని ఆజ్ఞాపిస్తాడు.

చెమూగా నాగరికభావాల వైపు పరుగులు తీస్తుంటే, టెమూజిన్ మరో సవతి తమ్ముడు– సబుతామ్ – మంగోలు సైన్యానికి నాయకుడుగా ఉన్నాడు. అన్నగారంటే వల్లమాలిన గౌరవం. ఆయన ఇచ్చిన ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటించడం, తండాలోని ఆబాలగోపాలాన్ని రక్షించడం అతని బాధ్యత.

ప్రతి తండాకు ఒక షామాన్ (మతపెద్ద–పూజారి) ఉంటాడు. యెక్కామంగోల్ తండాకు గుయగ్జు షామాన్. ఆయనను భగవంతునికి ప్రతిరూపంగా భావిస్తారు. ఆయనే టెమూజిన్ భగవంతుడి అవతారమని, మంగోల్ ప్రజల ఉజ్జ్వల భవిష్యత్తు కోసం ఆయన ఇక్కడ అవతరించాడనీ చెప్పి అందర్నీ నమ్మిస్తాడు. అయితే మనిషిగా పరమ దుర్మార్గుడు. తన మాటను ప్రశ్నించినవాళ్లని నిర్దాక్షిణ్యంగా తనకు అడ్డులేకుండా చేయగల సమర్థుడు. మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలను నడుపుతూ ఉంటాడు. చివరకు కొన్ని విరోధి తండాలతో మంతనాలాడుతూ టెమూజిన్ ప్రాణానికే హాని తలపెట్టినప్పుడు అతని అవిశ్వాసాన్ని తన కత్తికి బలి చేస్తాడు టెమూజిన్.

మొత్తం కథలో టెమూజిన్ మేనమామ కరాచర్ పాత్ర చాలా కీలకమైంది. అతడు ఈ తండాకు, ఆ తరువాత అన్ని మంగోల్ తండాలకు మంత్రిగా వ్యవహరిస్తాడు. తన చెల్లెలు యూలన్ పెంచి పెద్ద చేశాడు. యానుకి తన చెల్లెల్ని బలవంతంగా ఎత్తుకు వచ్చి పెళ్లి చేసుకున్నప్పుడు వెనకముందులు ఆలోచించి యూలన్‌ని పరిస్థితులకు ఎదురుతిరగవద్దని సలహా చెప్పి, అతని మెర్కిట్ తండాను వదిలిపెట్టి యూలన్ వాళ్ల యెక్కా తండాలోనే ఉండిపోతాడు. టెమూజిన్‌కు కరాచర్ సలహాలమీద పెద్ద గురి. కేరియట్ తండా నాయకుడు తుఘ్రుల్‌ఖాన్‌తో సంప్రదించవలసి వచ్చినప్పుడు వారి నుంచి ఆహారధాన్యాలే కాకుండా, అధునాతన (అప్పటికి) సైనిక పరికరాలను కూడా ఇవ్వాలని షరతు పెట్టి నెగ్గుతాడు. అలాగే అతని సలహాతోనే

అంతవరకు చైనీయులకు మాత్రమే తెలిసిన ముందుగుండు సామగ్రి తయారీ విధానాన్ని తమవారికీ నేర్పాలని చైనా రాజుతో జరిపిన మంతనాలలో నిక్కచ్చిగా చెబుతాడు. చెమూగా అధీనంలో ఉన్న కైమాన్ తండా నుంచి తిరిగి వచ్చేటప్పుడు ఆ తండా సైన్యం చేత చంపబడ్డాడు కరాచర్.

తుఘ్రుల్‌ఖాన్ కేరట్ నాయకుడు. అతని దగ్గర చెప్పడానికి వీలులేనంత ధనమూ, బలగమూ ఉన్నాయి. అతనికి యీ మతమనీ, ఆ మతమనీ లేదు. రోజుకో మతం పుచ్చుకుంటాడు. క్రిస్టియన్లు, మహమ్మదీయులు, బౌద్ధులు, షామాలు అందరూ ఆయన్ని తమ మతంలోకి రమ్మంటారు. అందరితోను వాళ్ల మతాన్నే అనుసరిస్తున్నానంటాడు. తనను రాజ్యం నుంచి తరిమివేసిన తన తమ్ముడిని శిక్షించి తనను మళ్లీ గద్దె ఎక్కించమని అడగడానికి యూసుకిని ఆశ్రయిస్తాడు. నైమాన్ తండా సహాయంతో ఆ రాజ్యాన్ని తుఘ్రున్‌ఖాన్‌కు ఇచ్చి వేశాడు. అప్పుడు టెమూజిన్‌కి “అండా” (అన్నదమ్ముడు) లా ఉంటానని వాగ్దానం చేశాడు. కిన్ చక్రవర్తితోను, పర్షియన్లతోను టెమూజిన్ తనతో ఉండగా మాట్లాడాలని తుఘ్రుఖాన్ కోరతాడు. టెమూజిన్‌ను తన నగరానికి పిలిచి విందునిస్తాడు. అదే సమయంలో యెక్కా తండాకు క్రిస్టియన్, మహమ్మదీయ, బౌద్ధ మత గురువులను పంపి ఆ తండా మత విశ్వాసాలను కించపరచమని చెబుతాడు. ఇప్పుడు మంగోలు సైన్యం పటిష్టంగా లేదని భావించి తుఘ్రుల్‌ఖాన్ పెద్ద సైన్యాన్ని టెమూజిన్ దగ్గరకు పంపి, తార్‌తార్‌లతో మంగోలు సైన్యం చేస్తున్న యుద్ధంలో తమ సైన్యం సహాయం చేస్తుందని కబురంపాడు. అంత సైన్యం తమ పరివారాన్ని చుట్టుముట్టగానే టెమూజిన్‌కి తుఘ్రుల్ పన్నాగం అర్థం అయింది. టెమూజిన్ కూడా ఆ సైన్యాన్ని బయలుదేరదీసి తామొక రెండు మూడు రోజుల్లో కలుస్తామని చెప్పాడు. తుఘ్రుల్ సైన్యం మంచుకొండల్లో ఎన్నో రోజులు వేచి ఉండవలసి వచ్చింది. ఇంతలో తార్‌తార్, నైమాన్, మార్కిట్ తండాలు ఒకవైపు, టెమూజిన్ నాయకత్వాన యెక్కా మరొకవైపు తుఘ్రుల్ సైన్యాన్ని చుట్టుముట్టి వశపరుచుకుంటారు. ఈ సంఘర్షణతో టెమూజిన్ మంగోలు తండాలకు తిరుగులేని నాయకుడైనాడు.

తుఘ్రుల్ తగిన సమయం కోసం వేచి ఉంటాడు. నైమాన్ తండాకు నాయకుడుగా చెమూగాను పంపగానే అతని దగ్గర చేరి అన్నగారి మీద తిరుగుబాటుకు ప్రోత్సహించాడు. కాని చెమూగా భ్రాతృ భక్తి, టెమూజిన్ కార్యనిర్వహణవల్ల ఆ ఆపద తప్పింది. చివరకు కిన్ చక్రవర్తి మహాసైన్యానికి నాయకుడైన టెమూజిన్ మీదకు దండెత్తి వస్తాడు తుఘ్రుల్‌ఖాన్. దానికితోడు టెమూజిన్‌తో ఉన్న తండాలలో రోజుకొక తండా వచ్చి తనతో చేరడంతో అతను గర్వంతో విర్రవీగడం మొదలుపెట్టాడు. కానీ ఆ సైన్యాలన్నీ ఒక రాత్రివేళ తుగ్రళ్ సైనికులందరినీ హతమారుస్తాయి. ఏం జరిగిందో తెలుసుకొని శత్రువులను ఎదిరించేలోగానే టెమూజిన్ మెరికల్లాంటి తన సైనికులతో వచ్చి తుఘ్రుల్‌ని చంపి అతని సైన్యాన్ని పరాజయంపాలు చేస్తాడు.

కేవలం పురుషులకు విలాసవస్తువుగా ఉండకుండా తమ వ్యక్తిత్వాన్ని, స్వతంత్రతను చాటి చెప్పిన స్త్రీలు కూడా ఈ కథాగమనానికి తోడ్పడుతారు. వాళ్లంతా మంగోలుల తండా జీవితానికి అలవాటుపడ్డవాళ్లే. అందరూ ఉత్సాహంతోను, జీవితేచ్ఛతోను బ్రతుకును ఆనందమయం చేసుకున్నవారే! వారిలో మొదటిది యూలన్. ముందు యూసుకి తనను బలవంతాన ఎత్తుకు రావడంవల్ల విరోధించిన తండాకు రాణిగా ఆమె అందరినీ సానునయంగా సాకింది. అయినా తన సవతులతోను, కోడలుతోను ఎప్పుడూ ఘర్షణ పడుతూనే ఉండేది. తన అన్నగారు కరాచర్ మరణించినప్పుడు అతని మృతదేహాన్ని తమ తండాకు చేర్చమని విలపిస్తుంది. అతని మరణానికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. చెమూగా తల్లి కుకుషాన్ ఖాటూమ్ తన కొడుకు



3

ఆత్మహత్య చేసుకోవడాన్ని హర్షించదు. అంతకన్న టెమూజిన్‌తో యుద్ధం చేసి మరణిస్తే తాను సంతోషించేదానినని చెబుతుంది.

ఈ మంగోలు స్త్రీలతోపాటు ఇతర జాతుల స్త్రీలు కూడా నవలలోని ఆయా ఘట్టాలలో ప్రధాన పాత్ర పోషిస్తారు. తుగ్రుల్‌ఖాన్ తమ్ముడు బైషీ భార్య బైషీ ఖాటినస్ అటువంటివారిలో ఒకతె. బైషీ మగతనం లేనివాడు. జీవితం నిండుగా అనుభవించాలని భావించేది ఖాటూనిస్. పెద్దదైనా టెమూజిన్‌ని చూడగానే తన మనసును, స్త్రీత్వాన్ని అతనికి అప్పగించింది. తానింక బ్రతుకక్కరలేదని మూర్ఛపోతే తన మమతతో ఆమెను మళ్లీ బ్రతికించుకుంటాడు టెమూజిన్. ఆమె చివరకు తన మరిది కూతురు అబికాతో సహా టెమూజిన్ దగ్గరకు వెళ్లి అతనితోనే ఉండిపోతారు.

టెమూజిన్ మరో భార్య కూలన్. ఆమె అత్యవసర పరిస్థితుల్లో టెమూకి తోడుగా ఒక నట్టడవిలో ఉన్న ఒక పర్వతాగ్రం మీద ఆరు నెలల పాటు ఒక మృగంతో కాపురం చేస్తుంది.

యాసుకీ యూలన్‌ను ఎత్తుకు రావడంతో ప్రారంభమైన నవల కురవ్‌తాయ్– నాయకుల (పెద్దల) సభతో ముగుస్తుంది. ఆ సభ జరిగింది 1206లో. కేరట్, కిన్, టర్కీసుల సంయుక్త సైన్యాన్ని మంగోలు సైన్యం మట్టుపెట్టిన వెంటనే జరిగిన సభ. విజయోత్సవ సభ– అన్నమాట. ఇక్కడే టెమూజిన్ సింహాసనం దిగివచ్చి పెద్దలను తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకోమని అడుగుతాడు. వారంతా ఏకగ్రీవంగా టెమూజిన్‌ను చంఘీజ్‌ఖాన్ అన్న బిరుదుతో తమ నాయకుడిగా ఎన్నుకుంటారు. గోబీ ఎడారిలో తమ తిరుగులేని నాయకత్వం ఆధారంగా ఈ నాయకులు టెమూజిన్ నాయకత్వాన ప్రపంచాన్ని జయించడానికి ఆ రోజు నుంచే ప్రారంభం జరుగుతుంది.

ఈ నవలలో యూసికి, టెమూజనిక, ఇతర మంగోలు నాయకుల యుద్ధ పటిమతోపాటు వారి జీవిత విధానం, ఎంతటి ప్రమాదాలు జరిగినా ముందుకు పోయే కరుకుతనం ప్రతి సంఘటనలోను మనకు దర్శనమిస్తాయి. ప్రతీ పాత్రను జీవంతం చేయడమేకాక, ప్రతి సంఘటననూ సహజంగా చిత్రించాడు రచయిత. నవలా వాతావరణాన్ని పాత్రల వ్యక్తిత్వాలతో ఇంతగా అనుసంధానం చేసిన నవలలు తెలుగులో బహుకొద్దిగా ఉన్నాయి. అందులో 'చంఘిజ్‌ఖాన్' మేలుబంతి. కథా సంవిధానంలో నాటకీయత, పాత్రల జీవనసరళిలో నైశిత్యం, కథనంలో కవితాశైలి– ఇవి ఈ నవలను చిరస్మరణీయం చేశాయి.

– – –



4